క్లుప్తంగా

దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధికి కృషి

తోట్లవల్లూరు: దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పెట్రోల్ బంక్ వద్ద తోట్లవల్లూరు–ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, సర్పంచ్ పెను మత్స రాధిక, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ మల్లికార్జున, నాయకులు శివశంకర్, వెంకటేశ్వరరావు,రామకృష్ణ, మురళి, గోపయ్య, రాంబాబు, దౌలా పాల్గొన్నారు.

వసతులు కల్పించేందుకు కృషి

పమిడిముక్కల: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పమిడిముక్కల్లో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ నవీన్‌కుమార్, సర్పంచ్ ముళ్లపూడి సునీత, కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆస్తుల రిజిస్ట్రేషన్‌లో కూటమి కొత్త కొర్రీ

గుడ్లవల్లేరు: ఆస్తుల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం కొత్త కొర్రీ పెట్టడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని భూములు, ఇళ్లు, ఇతర ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక ప్రాంతంలో ఉన్న ఆస్తిని సంబంధిత యజమాని వేరే ప్రాంతంలో అయినా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియలో ఆ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసేందుకు గత వైఎస్సార్ సీపీ హయాంలో ఒక గంటలో అనుమతిని ప్రభుత్వం ఇచ్చేది. ఈ నెల ఒకటో తేదీ నుంచి కూటమి ప్రభుత్వం కొత్త మెలిక పెట్టింది. వేరే ప్రాంతంలో ఆస్తిని సంబంధిత యజమాని మరొక ప్రాంతంలో రిజిస్ట్రేషన్ చేయాలంటే అనుమతి ఇచ్చేందుకు 48 గంటల వ్యవధిగా కొత్త ఆంక్షను విధించారు. ఈ కొత్త నిబంధనతో రిజిస్ట్రేషన్ల విషయంలో 48గంటల పాటు పడిగాపులు కాచేందుకు సంబంధిత యజమానులు ససేమిరా అంటున్నారు. గత సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో వలె అదే ఒక గంట వ్యవధిలో అనుమతిని ఇచ్చే విధంగా పాత పద్ధతినే ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని బాధితులు కోరుతున్నారు.

లోకుమూడిలో ఫిజియోథెరపీ క్యాంపు



మండవల్లి: మండలంలోని లోకుమూడి ఎంపీపీ స్కూల్లో మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ కె.సునీత ఆరుగురు చిన్నారులకు ఫిజియోథెరపీ చేసి మందులు పంపిణీ చేశారు. ఐఈఆర్‌టీలు టి.అరుణకుమారి, పి.వసంత, జి.శైలజ పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు సాయం

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులో అగ్ని బాధితులు జంగం శ్రీనివాసరావు, జంగం ముసలయ్య, నత్తా సుబ్బారావు, మాసవరపు రోశయ్య కుటుంబాలకు మంగళవారం రెడ్‌క్రాస్ సంస్థ సాయం అందించింది. బాధితులకు రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్, జిల్లా కన్వీనర్ హరికృష్ణ టార్పాలిన్, వంట పాత్రలు, దుప్పట్లు, నిత్యావసరాలను అందజేశారు.

సీసీ కెమెరాల అందజేత

గుడ్లవల్లేరు: శాంతి భద్రతల రీత్యా నిఘా నిమిత్తం గుడ్లవల్లేరులో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను స్థానిక నెహ్రూ పశువుల సంత కమిటీ, గ్రామాభివృద్ధి సంఘం వారు అందజేశారు. మంగళవారం ఎస్‌ఐ ఎస్.వి.వి.సత్యనారాయణకు ఆ కమిటీ చైర్మన్ వల్లభనేని వెంకటసుబ్బారావు చేతుల మీదుగా ఈ కెమెరాలను అందించారు.

నేటి నుంచి పశువైద్యశిబిరాలు

గుడ్లవల్లేరు: పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని వెటర్నరీ గుడ్లవల్లేరు ఏడీ డాక్టర్ ఎ.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఈ నెల 22 నుంచి 31 వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాలను దత్తత తీసుకోవాలి

మండవల్లి: జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రతి అధికారి ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్య, వైద్యం , ఉపాధి, పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు.

ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డ రోడ్డు వద్ద ఉన్న శ్రీవీరాంజేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. తొలుత ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఈఓ ప్రసాద్ తెలిపారు.

బుడమేరు ప్రక్షాళన జరిగేనా?

బుడమేరు ఆక్రమణలతో కుచించుకుపోయింది. డ్రెయిన్‌లో కొందరు అడ్డగోలుగా అక్రమ కట్టడాలు, ఫ్యాక్టరీల నిర్మాణం చేపట్టారు. మరికొందరు యథేచ్ఛగా రొయ్యలు, చేపల చెరువుల తవ్వకాలతో డ్రెయిన్ బక్క చిక్కిపోయింది. దీంతో బుడమేరు పొంగినప్పుడు చుట్టుపక్కల గ్రామాలు, పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆక్రమణలతో కుచించుకుపోయిన డ్రెయిన్
- ప్రక్షాళనను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం



కురిపిరాల వద్ద డ్రెయిన్‌లో సాగు చేస్తున్న పామాయిల్ తోట

గుడివాడరూరల్: వరదల సమయంలో కూటమి ప్రభుత్వం బుడమేరును ప్రక్షాళన చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. విజయవాడ వంటి మహానగరంతో పాటు గ్రామాల్లోని మురుగు నీటిని కొల్లేరులో కలిపే డ్రెయిన్ ఆక్రమణకు గురి కావడంతో ఇటీవల సంభవించిన వరదల దెబ్బకు విజయవాడ నగరం జలదిగ్బంధంలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ప్రాణనష్టంతో పాటు వేలాది ఎకరాల పంట నీటి పాలైంది. వరదలు సంభవించి ఐదు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రక్షాళనపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో బుడమేరు ప్రక్షాళన జరిగేనా అనే అనుమానం డ్రెయిన్ పరివాహక ప్రాంతాల్లోని ప్రజల్లో నెలకొంది. విజయవాడ నుంచి కొల్లేరు వరకు విస్తరించి ఉన్న బుడమేరు డ్రెయిన్ విజయవాడరూరల్, ఉంగుటూరు, బాపులపాడు, నందివాడ మండలాలతో పాటు ఏలూరు జిల్లా పెదపాడు వరకు విస్తరించి ఉంది. డ్రెయిన్ ద్వారా మురుగు నీరు వెళ్లడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలకు సాగునీరు అందిస్తోంది.

కరకట్టలు బలహీనం

ఇటీవల సంభవించిన వరదల దెబ్బకు బుడమేరు కరకట్టలు బలహీనంగా మారిపోయాయి. నందివాడ మండలం అరిపిరాల సమీపంలో ఓ టీడీపీ నేతే కాంట్రాక్టర్‌గా మారి ఆధునికీకరణ పనుల్లో డ్రెయిన్ కరకట్టలను పటిష్టంగా నిర్మించాల్సి ఉండగా తూతూ మంత్రంగా పనులు చేపట్టి బిల్లులు చేజిక్కించుకున్నారు. ఫలితంగా కరకట్ట దారుణంగా దెబ్బతింది. రామాపురం వద్ద ఇదే పరిస్థితి. కరకట్ట బలహీనంగా మారి బక్కచిక్కిపోయింది. ఎల్ఎస్‌పురం వద్ద కరకట్ట బలహీనంగా ఉంది. కరకట్టలు బలహీనంగా ఉన్నా అధికారులు ఇప్పటి వరకు పటిష్టం చేయడంపై దృష్టిసారించడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

ఆక్రమణలతో పిల్ల కాలువలా..

విజయవాడ నుంచి కొల్లేరు వరకు ఆక్రమణల దెబ్బకు డ్రెయిన్ పిల్ల కాలువలా మారింది. విజయవాడ పరిసర ప్రాంతాల్లో డ్రెయిన్‌ను అడ్డగోలుగా అక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టడంతో రూపురేఖలు కోల్పోయింది. పుట్టగుంట సమీపంలో డ్రెయిన్‌ను ఆక్రమించి అధికార పార్టీ నాయకుడు ఒకరు రొయ్యల, చేపల చెరువులను తవ్వేసి సాగు చేస్తున్నాడు. కురిపిరాల సమీపంలో ఓ టీడీపీ నేత ఏకంగా డ్రెయిన్‌లోనే తవుడు ఫ్యాక్టరీ నిర్మించేశాడు. అదే నాయకుడు అక్రమంగా 10 ఎకరాల్లో పామాయిల్ తోట సాగు చేస్తున్నాడు. బాపులపాడు మండలం ఓగిరాల వద్ద భారీ స్థాయిలో టీడీపీ నేతలే ఆక్రమణదారులుగా మారి 30 ఎకరాల్లో భారీ చేపల చెరువులు తవ్వేశారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం వడ్డిగూడెం వద్ద ఆ ప్రాంత అధికార పార్టీ నాయకుడి అనుచరులు 20 ఎకరాల్లో రొయ్యల చెరువులు తవ్వేశారు. కుదరవల్లి గ్రామంలో ఓ టీడీపీ నాయకుడు 10 ఎకరాల్లో బుడమేరును ఆక్రమించి రొయ్యల చెరువు తవ్వేశాడు.



అరిపిరాల వద్ద బలహీనంగా మారిన బుడమేరు కరకట్ట (ఫైల్)

నట్టేట మునిగిన గ్రామాలు, పంటలు

ఆక్రమణలతో డ్రెయిన్ కుచించుకుపోయి నీటి ప్రవాహం సక్రమంగా జరగకపోవడంతో గత ఏడాది సెప్టెంబర్‌లో సంభవించిన వరదల దెబ్బకు విజయవాడ మహానగరం కకావికలమైంది. రోజుల తరబడి నీరు పట్టణంతో పాటు గ్రామాలను ముంచేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రాణనష్టంతో పాటు ఆస్తినష్టం భారీగా సంభవించింది. చరిత్రలో చూడని విధంగా బుడమేరు ఉగ్రరూపం దాల్చడంతో వేలాది ఎకరాల పంట నీటి పాలు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఆక్రమణదారుల్లో అధిక శాతం టీడీపీ నేతలే!



కురిపిరాల వద్ద డ్రెయిన్‌లో నిర్మించిన ఫ్యాక్టరీ

వరదల సమయంలో సాక్షాత్తూ సీఎం చంద్రబాబునాయుడు బుడమేరు ప్రక్షాళన చేపడతామని చెప్పారు. ఇంత వరకు ప్రక్షాళనపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఆక్రమణదారుల్లో అధిక శాతం టీడీపీ నేతలే ఉండటంతో ప్రక్షాళనపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందనే విమర్శలున్నాయి.

నిర్లక్ష్యంగా ప్రభుత్వం



బుడమేరు ముంపు సమయంలో అధికార పార్టీ ఇచ్చిన హామీని విస్మరించింది. ఆక్రమణలు తొలగిస్తామని చెప్పిన మాటను పట్టించుకోవడం లేదు. డ్రెయిన్ ప్రక్షాళనకు రివర్స్ కన్‌ఫర్‌మెన్స్ యాక్ట్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తేనే ప్రక్షాళన సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– నీలం మురళీకృష్ణారెడ్డి, రైతు సంఘ నాయకుడు

ఆక్రమణలతో నష్టపోయాం



బుడమేరు ఆక్రమణల దెబ్బకు వరదలతో పంటలు పూర్తిగా పోయి తీవ్రంగా నష్టపోయాం. పంటలు ముంపునకు గురై పెట్టిన పెట్టుబడిన నీటిపాలైంది. ప్రభుత్వం ఆక్రమణలు తొలగిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ముంపు సమస్యకు నిధులు కేటాయించి ఆక్రమణలు తొలగించాలి.

– సత్యనారాయణ, రైతు, ఎల్ఎస్‌పురం

25న కొల్లేరు సమావేశాన్ని విజయవంతం చేయాలి

కైకలూరు: కొల్లేరు పరివాహక ప్రజలు ఎదుర్కొంటున్నా ఇబ్బందులపై ఈ నెల 25 కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఏర్పాటు చేయనున్న కొల్లేరు సమావేశానికి భారీగా కొల్లేరు ప్రజలు తరలిరావాలని రాష్ట్ర వడ్డీ సాధికారత కమిటీ చైర్మన్ బలే ఏసురాజు మంగళవారం పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో కొల్లేరులో ప్రశాంతంగా జీవిస్తున్న కొల్లేరు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పలు ప్రాంతాల్లో పొక్లెయిన్‌లు, జీరో పాయింట్ చెరువులను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. కొల్లేరు ప్రజల సత్తా వినిపించేందుకు ప్రజలు భారీగా తరలిరావాలని ఏసురాజు కోరారు.

కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ



ముదినేపల్లి రూరల్: మధ్యాహ్న భోజన పథకాన్ని సకాలంలో నిర్వహించలేదనే ఆరోపణలపై స్థానిక ప్రిన్సిపాల్ ఎం.జాస్మిన్‌ను అధికారి మంగళవారం విచారణ చేశారు. కళాశాల్లో ఈ నెల 4న మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి నేతలు ప్రారంభించారు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ విధులకు సకాలంలో హాజరుకాలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు మచిలీపట్నం ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి సాల్మన్‌రాజ్‌ను విచారణ జరపాలని ఆదేశించారు. ఈ మేరకు కళాశాలకు చేరుకున్న సాల్మన్‌రాజు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో పాటు కూటమి నేతలను విచారణకు పిలిపించి మధ్యాహ్న భోజనం అమలులో ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

వివేకానందుని విగ్రహ పునఃప్రతిష్ట



కైకలూరు: స్థానిక పోలీసు క్వార్టర్స్‌లో వివేకానందుని తిథి నక్షత్రం పరంగా జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ మంగళవారం పునఃప్రతిష్ఠించారు. డీఎస్పీ మాట్లాడుతూ 2019లో ఏర్పాటు చేసిన వివేకానందుని విగ్రహాన్ని క్వార్టర్స్ స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా పునః ప్రతిష్ట చేయడం అభినందనీయమన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో మండల పోలీసు స్టేషన్లకు వాలీబాల్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, ఎస్‌ఐ వెంకట్‌కుమార్, శ్రీనివాసరావు, రాంబాబు, వేంకటేశ్వరరావు, రామచంద్రరావు, వీరభద్రరావు, రామకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణపై శ్రద్ధ వహించాలి

తోట్లవల్లూరు: పశువుల సంరక్షణపై పశుపోషకులు శ్రద్ధ వహించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఎం.రామశేఖర్ సూచించారు. మండలంలోని దేవరపల్లి పశువైద్య కేంద్రంలో ఉచిత పశువైద్య శిబిరం మంగళవారం జరిగింది. డాక్టర్ రామశేఖర్ ఆధ్వర్యంలో పశు యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వ పథకాల గురించి వివరించటంతోపాటు పశువులకు ఆరోగ్య పరీక్షలు జరిపి మందులను ఉచితంగా అందజేశారు. అలాగే గొర్రెలకు నట్టల నివారణ మందు, టీకాల కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించి బహుమతులను అందజేశారు. దేవరపల్లి పశువైద్యాధికారి ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ వరప్రసాద్ అన్నారు. మండలంలోని పెరికెగూడెం, చింతపాడు గ్రామా ల్లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. కానుకొల్లు డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వ మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 723 మూగజీవాలకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ డి.సృజనకుమార్ పశువుల ఆరోగ్య సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పెదముత్తేవిలోని శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి నాగలక్ష్మీ ప్రసన్న, టీడీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరావు ప్రారంభించారు. పెడసనగల్లు పశు వైద్యశాల్లో నిర్వహించిన శిబిరంలో మూగజీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి సేవలు అందించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: పశువైద్య శిబిరాల్లో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ముదినేపల్లి, ప్రొద్దువాక వెటర్నరీ డిస్పెన్సరీల వైద్యాధికారులు యు.క్రాంతికుమార్, కె.రామకృష్ణ అన్నారు. మండలంలోని అల్లూరు, గురజ గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు.

సమన్వయంతో పనిచేస్తే ప్రగతి సాధ్యం




అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తే గుడివాడ ప్రగతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ప్రజావేదికలో గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని అధికారులు, శానిటేషన్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తాను అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సమావేశంలో స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.7.50 కోట్లు

గుడివాడరూరల్: నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.7.50కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై స్థానిక టీడీపీ కార్యాలయంలోని ప్రజావేదికలో ఆ శాఖ అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలతో పనులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ కె.శ్రీనివాస్, జేఈఈ హరీష్ , తదితరులు పాల్గొన్నారు.



మంచు దుప్పటి

వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు విపరీతంగా మంచుకురిసింది. కురుస్తున్న మంచు కారణంగా రహదార్లపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

–పామర్రు

గుర్రపు డెక్క నివారణకు చర్యలు



పెదపారుపూడి: మండలంలోని పాతలింగవరంలోని చానల్లో ఉన్న గుర్రప డెక్క తొలగింపునకు ఇరిగేషన్ అధికారులు రసాయనిక మందులను పిచికారీ చేశారు. 'గుర్రపడెక్క తొలగించరూ' అని సాక్షిలో ఆదివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఇరిగేషన్ అధికారులు పాత లింగవరం చానల్లో గుర్రపడెక్క తొలగింపునకు చర్యలు చేపట్టారు. జనార్దనపురం ఇరిగేషన్ ఏఈ పవన్‌కుమార్ పర్యవేక్షించారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ప్రొకర్ల(పామర్రు): మినుము సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ శివ నాగమణి అన్నారు. మండలంలోని, ప్రొకర్ల నిమ్మకూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మినుము తొలిదశలో తామర పురుగులతో ఆకుముడత వస్తుందన్నారు. దీని నివారణకు ఎసిఫేట్ గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పొగాకు లద్దె పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

రామ్మూర్తికి ఘన నివాళి

గుడివాడ టౌన్: విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గ ఔన్నత్యాన్ని ఇనుమడింపచేసిన మహనీయుడు గాణాల రామ్మూర్తి అని విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం రామ్మూర్తి జయంతి వేడుకలు స్థానిక వీర బ్రహ్మేంద్ర స్వామిదేవస్థాన ప్రాంగణంలో జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ రామ్మూర్తి కృషి కారణంగా విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాన్ని బీసీలుగా ప్రభుత్వాలు గుర్తించాయన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షుడు వసుధ బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు!



మాట్లాడుతున్న 15వ వార్డు సభ్యుడు కేవీఎస్ఎం నాయుడు

కైకలూరు: కైకలూరు పంచాయతీ సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి చెక్‌పవర్‌ను రద్దు అయినట్లు 15వ వార్డు సభ్యుడు కేవీఎస్ఎం.నాయుడు తెలిపారు. ఆయన నివాసం వద్ద సహచర వార్డు సభ్యులు నాంచారయ్య, శ్రీనివాసరావు, శ్యామలరావు, శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 10 నెలలుగా పంచాయతీ అవినీతిపై పోరాటం చేసిన ఫలితంగా ఉన్నతాధికారులు స్పందించి సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ ఫణీంద్రను వివరణగా కోరగా జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ నుంచి ఈ నెల 18న పంచాయతీరాజ్ చట్టం 1995 నిబంధన మేరకు ఆరు నెలలు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు ఆదేశాలు అందాయన్నారు. సర్పంచ్ షోకాజ్ నోటీసులకు వివరణ ఇవ్వని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉందన్నారు. కాగా ఆరోపణలు రుజువైతే రాజీనామాకు సిద్ధమని సర్పంచ్ మేరీ నవరత్నకుమారి తెలిపారు.

23, 24 తేదీల్లో గ్రిగ్ పోటీలు

గుడివాడ టౌన్: గుడివాడ సబ్ జోన్ గ్రిగ్ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు గుడివాడ సబ్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.మృత్యుంజయ, పి.ఏసురత్నం మంగళవారం తెలిపారు. 23వ తేదీన సీనియర్ బాలురు (1 జనవరి 2008 తరువాత పుట్టిన వారు, 10వ తరగతి లోపు చదువుచున్న విద్యార్థులకు), 24వ తేదీన అండర్ – 14 బాలురు (1 జనవరి 2011 తరువాత పుట్టిన వారై, 8వ తరగతి చదువుచున్న విద్యార్థులు) ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరూ పాల్గొనుటకు అర్హులని తెలిపారు. ఈ పోటీలు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు: బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎప్పుడూ ఆసరా కల్పిస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అరవింద్, నాయకులు పరసా సుబ్రమణ్యం, దాలిపర్తి ప్రసాద్, వీరంకి వెంకటేశ్వరరావు, దత్తుడు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయటం శుభ పరిణామం

పామర్రు: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సముచిత స్థానం కల్పిస్తూ నిధులు మంజూరు చేయటం ఏపీకి ఎంతో శుభ పరిణామమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి రూ. 11,440 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నాయకులు వీరంకి వెంకటేశ్వరరావు, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.